

వాల్‌రైటింగ్ రాస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

## బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్
- ఖనిలో వాల్ రైటింగ్స్

గోదావరిఖని, ఏప్రిల్ 10: మన ఇంటి పార్టీ పండుగ ఈ నెల 27న వరంగల్‌లో జరగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి రావాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపు నిచ్చారు. గురువారం తిలక్‌నగర్‌లో సభ వాల్ రైటింగ్‌తో విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందగా కదిలిరావాలని కోరారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌తో రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు వనరులను దోచుకుంటున్నారని విమర్శించారు. వరంగల్ రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్ భవిష్యత్ దిశానిర్దేశం చేస్తారని నియోజకవర్గం నుంచి వేలాదిగా సభకు రానున్నట్లు చందర్ పేర్కొన్నారు. ఇక్కడ మాజీ కార్పొరేటర్లు జేవీ రాజు, పాముకుంట్ల భాస్కర్, నాయకులు ఇరుగురాళ్ల శ్రావణ్, చింతకింది సంపత్, బుర్ర వెంకన్న, చింటు, కిరణ్, రామరాజు ఉన్నారు.

## ఖాళీ సిలిండర్లతో మహిళల నిరసన



కోల్‌సిటీ : నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



పెద్దపల్లి టౌన్ : నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 10: వంట గ్యాస్ ధరల పెంపుపై గోదావరిఖనిలో మహిళలు ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. స్థానిక మల్లు స్వరాజ్యం కాలనీలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కుమారస్వామి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను అనేకసార్లు పెంచిందని మండిపడ్డారు. ధరల పెంపుతో ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. ధరల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మహేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు సారయ్య, రాజమౌళి, సృజన, సరిత, స్వప్న, రజిత, సులోచన, ఓదెలు, సుగుణ, స్వరూప, ప్రమీల ఉన్నారు.

**నడిరోడ్డుపై కట్టెలపొయ్యిపై వంట**

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్10: కేంద్రప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఖాళీ సిలిండర్ రోడ్డుపై పెట్టి కట్టెల పొయ్యి మీద వంట చేశారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు తగ్గుతుంటే బీజేపీ ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడంపై అసహనం వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇక్కడ సీపీఎం నాయకులు జ్యోతి, సీపెల్లి రవీందర్, కల్లెపల్లి అశోక్,మోదుంపల్లి శ్రావణ్, ప్రశాంత్, నవీన్, శ్రీనివాస్ రెడ్డి, శివాజీ, సందీప్, సూరజ్ పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్

ధర్మారం,ఏప్రిల్10:గురుకుల వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జక్కన్నపల్లిలోని ఎస్టీ మినీ బాలికల గురుకుల విద్యాలయంలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.145 కోట్ల నిధులతో నియోజక వర్గంలోని పాసిగాం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపనకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ శ్రీలత అధ్యక్షత వహించగా, రాష్ట్ర ఎస్టీ గురుకులాల డిప్యూటీ కార్యదర్శి వేణుగోపాల్,మండల ప్రత్యేక అధికారి,డీపీవో వీర బుచ్చయ్య, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్,తహసీల్దార్ ఎండీ వకీల్, ఎంపీవో రమేశ్, పీఆర్ ఏఈ రాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, డైరెక్టర్లు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## ఎంపీడబ్ల్యూలకు వేతనాలు చెల్లింపు

ధర్మారం, ఏప్రిల్ 10: జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్స్ (ఎంపీడబ్ల్యూ)కు మూడు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించినట్లు జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య వెల్లడించారు. జక్కన్నపల్లి ఎస్టీ మినీ గురుకుల విద్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1,079 మంది ఎంపీడబ్ల్యూలుగా పనిచేస్తున్నారని తెలిపారు. వారికి మూడు నెలల వేతనాలు చెల్లించినట్లు వివరించారు. ఇంటి పన్నుల వసూళ్లలో ముత్తారం, కాల్వ శ్రీరాంపూర్, అంతర్గాం మండలాలు ముందంజలో ఉన్నాయని వెల్లడించారు. ముత్తారం 100.16 శాతం,కాల్వ శ్రీరాంపూర్ 100.06 టాప్‌లో ఉందని, అంతర్గాం వంద శాతం పన్నులు వసూలు చేసినట్లు సాధించినట్లు వివరించారు.

## గురుకుల విద్యాలయంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

ధర్మారం,ఏప్రిల్10: జక్కన్నపల్లి ఎస్టీ బాలికల మినీ గురుకుల విద్యాలయంలో గురువారం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులు డ్యాన్స్‌లతో అదరగొట్టారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత,ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




సమావేశంలో సేఫ్టీ అధికారులు, రీజియన్ జీఎంలు

## ప్రమాద రహిత సింగరేణిగా నిలపాలి

గోదావరిఖని, ఏప్రిల్ 10: గనులపై రక్షణ చర్యలతో ప్రమాద రహిత సింగరేణిగా నిలపాలని సింగరేణి డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఎన్ నాగేశ్వర్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ బానోతు వెంకన్న, కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో జరిగిన రామగుండం రీజియన్ రక్షణ అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. గనుల్లో రక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పని ప్రదేశాలలో రక్షణ నినాదాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జీరో హార్మ్-జీరో ఆక్సిడెంట్ కంపెనీ లక్ష్యమని తెలిపారు. అనంతరం గనుల్లో గతంలో జరిగిన ప్రమాదాలపై సమీక్షించిన అధికారులు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను సమీక్షించారు. ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఆర్జీ-2 ఇన్‌చార్జి జీఎం రాముడు, రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ ఎన్ గుప్తా, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్,ఏజెంట్లు శ్రీనివాస్, రమేశ్, అధికారులు సాయిప్రసాద్, నెహ్రూ, మల్లేశం, రమేశ్‌కుమార్, రీజియన్ సేఫ్టీ అధికారులు, గనుల మేనేజర్లు, అధికారులు ఉన్నారు.

## ఓసీపీ-2 గనిలో సింగరేణి ఫారెస్ట్రీ అడ్వైజర్ పర్యటన

రామగిరి ఏప్రిల్ 10 : రామగుండం-3 ఏరియాలోని ఓసీపీ-2 ఉపరితల గనిని గురువారం సింగరేణి ఫారెస్ట్రీ అడ్వైజర్ ఎం.సి. ఫర్గెయిన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఓసీపీ-2 ఉపరితలగని పరిధిలోని ఓబీ డంపుపై ఉన్న 65 హెక్టార్ల భూమిని ప్రభుత్వ అటవీ శాఖకు అప్పగించడానికి కావలసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఉపరితలగని ఆవరణలో ప్రతిపాదిత నీటి తొట్టిలను ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు వివరాలు తెలియజేశారు. ఆయన వెంట డీఎఫ్‌వో శివయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్ వెంకటరమణ, ఎస్టేట్స్ విభాగాధిపతి కే ఐలయ్య, సర్వే విభాగాధిపతి డీ జనార్ధన రెడ్డి, ఎఫ్ఆర్ఓ. రమేశ్ ఉన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో అభివృద్ధి పనులు ప్రారంభం



పెద్దపల్లి టౌన్ : మెకానైజడ్ లాండ్రీని స్విచ్ ఆన్ చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్10: జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో రూ.కోటితో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడారు. మాతా శిశు కేంద్రంలో నవ జాత శిశు కేంద్రం, 40 పడకల ప్రత్యేక వార్డు, మెకానైజడ్ లాండ్రీని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఐవోసీఎల్ సంస్థ సామాజిక బాధ్యతతో అందించిన సహకారంతో 10 వార్మర్లు, ఇతర పరికరాలను నవ జాత శిశు కేంద్రంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు. ఇక్కడ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, గ్రంథలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ఈర్ల స్వరూప, డీసీహెచ్ఎస్ కొండ శ్రీధర్, డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి, డాక్టర్లు పాల్గొన్నారు.

**సన్నబియ్యం పంపిణీతో ప్రయోజనం**

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 10: రేషన్ దుకాణాల ద్వారా పంపిణీతో పేదలకు ప్రయోజనం చేకూరుతున్నదని కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు అన్నారు. పెద్దక్వలలో రేషన్‌లబ్ధిదారు చిటవేన లక్ష్మి-రవి దంపతుల ఇంట్లో రేషన్ భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సన్నబియ్యం పంపిణీని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డీవేణు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్, డీఎం శ్రీకాంత్, పెద్దపల్లి ఆర్డీవో బొద్దుల గంగయ్య, ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్, పెద్దపల్లి ఏఎంసీ చైర్మన్ ఈర్ల స్వరూప-సురేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ రెస్టారెంట్‌లో తనిఖీలు

కోల్‌సిటీ, ఏప్రిల్ 10: గోదావరిఖని మ్యాండేయ కాలనీలోని తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై గురువారం రాత్రి రామగుండం నగర పాలక సంస్థ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించి నిర్వాహకులకు రూ.8వేల జరిమానా విధించారు.

## పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

రామగిరి, ఏప్రిల్ 10 : వాణి సెకండరీ స్కూల్ యజమాన్యం ఫీజుల విషయంలో వేధిస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల విన్నపం మేరకు గురువారం వాణి పాఠశాల హెచ్ఎంను వివిధ పార్టీల నాయకులు చేరుకొని నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం వ్యవరిస్తున్నదని ఆరోపించారు. జేఏసీ పార్టీల నాయకులు గంట వెంకటరమణారెడ్డి, మూల్మూరి శ్రీనివాస్, వైనాల రాజు, కన్నూరి శ్రీశైలం, జనగామ రవికుమార్, ఆసం తిరుపతి, శ్రీనివాస చారి మాట్లాడారు. స్కూల్ యాజమాన్యం వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు..

## రిక్రూట్‌మెంట్ ర్యాలీ

పెద్దపల్లి, ఏప్రిల్10: జూన్ 10 నుం చి 18 వరకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించే అగ్ని వీర్ పథ్ (సంగీత కారుడు)కు రిజిస్ట్రేషన్ ఆధారి త రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్న ట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 21ఉదయం 11 గంటలకు నుంచి వచ్చే నెల 11 రాత్రి 11 గంటల వరకు వెబ్ పోర్టల్ https: //agnip athvayu.cdac.inలో రి క్రూట్ మెంట్ ర్యాలీలో పాల్గొనేం దు కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఆదివాసీలపై దాడులు ఆపాలి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్10: కేంద్రప్రభుత్వ ఆదివాసీలపై వెంటనే దాడులు ఆపివేయాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ ముడిమడుగుల మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం ఎదుట కర పత్రాలు విడుదల చేశారు. ఈనెల 20న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు మార్వాడి సుదర్శన్, బాలసాని రాజయ్య, గుమ్మడి కొమురయ్య, ఎరుకల రాజయ్య, రామిల్ల బాబు, పులిపాక రవీందర్, నార వినోద్, బొడ్డుపల్లి రవి, కొంతం రాజు పాల్గొన్నారు.

## ఓసీపీ-1లో ఎ-గ్రేడ్ ఆపరేటర్ల ఎంపిక

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 10 : సింగరేణి సంస్థ ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1లో గురువారం ఈపీ ఆపరేటర్ బీ-గ్రేడ్ నుంచి ఏ-గ్రేడ్ ఎంపిక ప్రక్రియనుపీఓ జే రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రామగుండం రీజియన్ వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులలో పని చేస్తున్న ఎ-గ్రేడ్ అర్హత గలిగిన 57మంది ఆపరేటర్లకుగాను 56మంది హాజరు కాగా వారికి అధికారులు వివిధ పరీక్షలు నిర్వహించారు.ఏరియా ఇంజనీర్ శేఖర్‌బాబు, ఇఅండ్ఎం డీజీఎం ఉదయ్ భాస్కర్, ఆర్జీ-2 డీజీఎం(ప) అనిల్ కుమార్, ఆర్జీ-1 పీఎం రవీందర్ రెడ్డిలు ఉన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోండి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 10 : సింగరేణి యాజమాన్యం 10వతరగతి విద్యార్థుల కోసం ఉచితంగా అందిస్తున్న పాలీసెట్ ఉచిత శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 ఇంచార్జీ జీఎం ఎం. రాముడు సూచించారు. గురువారం సెక్టార్-3 పాఠశాలలో ఉచిత పాలీసెట్ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రాసిన సింగరేణి, పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిమ్ డీజీఎం ఎండీఎం హుస్సేనీ, డీవైపీఎం వంశీధర్, పాఠశాల హెచ్ఎం సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 'కాజీపేట-దాదర్ ముంబై ఎక్స్‌ప్రెస్' రైలు పునఃప్రారంభం

పెద్దపల్లి, ఏప్రిల్10: కాజీపేట - దాదర్ ముంబాయి - కాజీపేట వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు పునః ప్రారంభించనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 12 నుంచి జూన్ 28 వరకు వయా పెద్దపల్లి - బల్లార్షా - ఆదిలాబాద్ - నాందేడ్ మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడవనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జమ్మికుంట, పెద్దపల్లి జంక్షన్‌లో స్టాప్ సదుపాయం కల్పించారు. ప్రతి శనివారం కాజీపేటలో ఉదయం 11.30 గంటలకు బయలు దేరి, పెద్దపల్లి జంక్షన్‌కి మధ్యాహ్నం 12:36కి చేరుకుటుంది. మరుసటి రోజు మధ్యాహ్నం 1.25 నిమిషాలకు దాదర్ రైల్వే స్టేషన్ చేరుకుంటుందని, తిరుగు ప్రయాణంలో దాదర్ రైల్వే స్టేషన్‌లో ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3 .25 నిమిషాలకు బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం పెద్దపల్లి జంక్షన్‌కి 7.38 గంటలకు చేరుకొని కాజీపేట జంక్షన్‌కు రాత్రి 9 .30 గంటలకు చేరుకుంటుందని రైల్వే అధికారులు వెల్లడించారు.

## పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

పాలకుర్తి, ఏప్రిల్10: కన్నాలగ్రామానికి చెందిన కొల్లూరి రాయమల్లు(73)పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ. స్వామి తెలిపారు. రాయమల్లు(73) భార్య ఇటీవల మృతిచెందింది. కొడుకు పెద్దపల్లిలో నివాసం ఉంటున్నారు. రాయమల్లు ఒక్కడే కన్నాల గ్రామంలో నివసిస్తున్నాడు. భార్య వియోగం తట్టుకోలేక మన స్తాపం చెంది బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. వెంట నే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**చికిత్స పొందుతూ వివాహిత**

జ్యోతినగర్, ఏప్రిల్ 10: లక్ష్మీపురానికి చెందిన కట్ల మమత(30) ఈ నెల 7న పురుగుల మందుతాగి ఆత్మహత్య కు యత్నించింది. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. మమత పెద్దపల్లి మండలం కొత్తపల్లి నివాసి. లక్ష్మీపురానికి చెందిన కట్ల గణపతితో 2017లో వివాహమైంది. భర్త వేధింపులతోనే ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. కాగా మమత మూడు రోజుల పాటు వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్సపొందుతూ మృతిచెందింది.




విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటీ ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి, డాక్టర్ మమతారెడ్డి

## విద్యార్థి జీవితంలో పూర్వ ప్రాథమిక విద్య కీలకం

పెద్దపల్లి కమాన్, ఏప్రిల్ 10 : ప్రతి విద్యార్థి జీవితంలో కిండర్ గార్డెన్ (పూర్వ ప్రాథమిక విద్య) కీలకమైందని, చిన్నప్పటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి ట్రినిటీ ప్రాథమిక పాఠశాలలో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే (స్నాతకోత్సవం) వేడుకను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూకేజీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడారు. ట్రినిటీ ప్రైమరీ స్కూల్‌లో లైఫ్ స్కిల్స్ ప్రత్యేక పాఠ్యాంశంగా బోధిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులు స్నాతకోత్సవ వస్త్రాధారణ, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కార్యదర్శిపై ఫిర్యాదు

ముత్తారం, ఏప్రిల్ 10: ఖమ్మంపల్లిలోని గతంలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి శ్యాంప్రసాద్‌పై హైదరాబాద్ లోని పంచాయితీ రాజ్, రూరల్ ఎంప్లాయిమెంట్‌లో గురువారం మాజీ సర్పంచ్ సముద్రాల రమేశ్ ఫిర్యాదు చేశారు. గతంలో పంచాయతీలో కంచె వేసేందుకు ఉపయోగించే ఇనుప జాలీలను గ్రామపంచాయతిలో వర్కర్ గా విధులు నిర్వహించిన మెంత్రి ఓదేలు దొంగలించాడని అప్పుడు సర్పంచ్, కార్యదర్శి ముత్తారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ అయినట్టు తెలిపారు. కానీ ఇప్పుడు కార్యదర్శి, మెంత్రి ఓదేలు కుమ్మక్కై రాజీ అయినట్టు రమేశ్ ఆరోపించారు. గతంలో ఓ మోటరు దొంగలించిన విషయంలో ఇంకా కోర్టులో ఓ కేసు నడుస్తుందని అన్నారు. దీనిని మాత్రం కేసు లేకుండా రాజీ కావడంతో ఆంతర్యం ఎమిటని ప్రశ్నించాడు. సదరు కార్యదర్శి పై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రమేష్ కోరారు.

## నేడు ఖని బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 10: గోదావరిఖని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గంకు నేడు శుక్రవారం ఎన్నికలు జరుగనున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగనుంది. అనంతరం ఫలితాలను విడుదల కానున్నాయి. మొత్తం 207 ఓట్లకు గాను జరుగు పోలింగ్‌లో 15 పదవులకు గాను నాలుగు జూనియర్ ఎగ్జిక్యూటివ్, ఒక ఉమెన్ ఎగ్జిక్యూటీవ్, ఒక మహిళా ప్రతినిధి పదవి ఏకగ్రీవంతో మిగిలిన పదవులు అధ్యక్ష పదవికి బల్మూరి అమరేందర్‌రావు, తౌటం సతీశ్, కిషన్‌రావు, వేల్పుల మురళీధర్‌రావు, సిహెచ్ శైలజ, మేడ చక్రపాణి పోటీ పడగా, ప్రధానకార్యదర్శి పదవికి గుళ్ళ రమేశ్, శీతాకారి చంద్రశేఖర్, ఎస్ సంజయ్ కుమార్, రాంటేంకి శ్రీనివాస్, కోశాధికారి పదవికి ఉమర్, కె వెంకటేశ్ పోటీ పడుతున్నారు. ఎన్నికలకు కార్యనిర్వహణ అధికారిగా కె శ్రీనివాసరావు, సహాయకునిగా బీ అనిల్‌కుమార్ వ్యవహరిస్తారు.

## ప్రధాన కార్యదర్శి సహేందర్‌రెడ్డి

మంథని, ఏప్రిల్ 10: మంథని బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శిగా ముస్కుల సహేందర్ రెడ్డిని గురువారం ఏకగ్రీవ ంగా ఎన్నుకున్నట్లు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు తెలిపారు. గురువారం జరిగిన బార్ అసోషియే షన్ కార్యవర్గ సమావేశంలో సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా ఎస్.భాస్కర్ రెడ్డిని, మహిళా కార్యవర్గ సభ్యురాలిగా శ్రీలక్ష్మిల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రఘోత్తమరెడ్డి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ విరాళాల సేకరణ

గోదావరిఖని, ఏప్రిల్ 10: సామాజిక ఉద్యమాల బలోపేతం కోసం సీఐటీయూ చేపడుతున్న గురువారం ఆర్జీ-1 జీడీకే 1,3 ఇంక్లైన్‌లో ఉద్యోగుల నుంచి సీఐటీయూ నాయకులు సామాజిక ఉద్యమ నిధి విరాళాలను సేకరించారు. సీఐటీయూ పిట్‌కమిటీ బృందం, ఆర్జీ-1 బ్రాంచీ అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి ఉద్యోగుల నుంచి విరాళాలు సేకరించి సామాజిక అంశాలపై పోరాటానికి ఉద్యోగులు విధిగా విరాళాలు అందించి సహకరించాలన్నారు. ఇక్కడ సంఘం రాష్ట్ర కార్యదర్శి మేదరి సారయ్య, కమిటీ సభ్యులు తోట నరహరిరావు, పిట్ సెక్రటరీ దాసరి సురేశ్, ఈదుల సాగర్, శశికిరణ్, అజయ్‌కుమార్, ఉద్యోగులు ఉన్నారు.

జ్యోతినగర్, ఏప్రిల్ 10: రామగుండం రైల్వేస్టేషన్ డిపోవద్ద సామాజిక ఉద్యమ సంఘీభావ నిధి సేకరించారు. రామగుండం రైల్వే కార్మికులు రూ.1,350 విరాళాలను అందజేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం రామాచారి, ఉపాధ్యక్షుడు బిక్షపతి, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కే తిరుపతి, ఎండీ యాసిన్, సరళ, సతీశ్, రాజు, అమృత, ఉన్నారు. ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంఘీభావ నిధికి కార్మికుల నుంచి రూ, 2,280 వరకు సేకరించారు. ఇక్కడ యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శి లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్, నాయకులు ఎండీ షిమీమ్, హనుమయ్య, విజయ్, రవి, శంకరాచారి, మల్లయ్య, సంపత్, ప్రభాకర్‌రెడ్డి, జూల శ్రీనివాస్, భూమేశ్ ఉన్నారు.

## గంజాయి విక్రేత అరెస్టు

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్10: సులువుగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా పెద్దపల్లి, ఇతర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్న షేక్ ఆసీఫ్ (36)ను పట్టుకొని రిమాండ్‌కు తరలించిన్నట్లు డీసీపీ కరుణాకర్ తెలిపారు. గురువారం రాత్రి ఏసీపీ కార్యాలయంలో డీసీపీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఆసీఫ్ కొంతకాలంగా ఈజీ మనీ కోసం నాగపూర్, కోల్‌కతా లాంటి ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసిన పెద్దపల్లికి తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు సీఐ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని పోలీసులు తనిఖీలు చేపట్టారు. పెద్దకల్వల డిగ్రీ కళాశాల వద్ద పాకెట్స్ చేసి రూ 5 వందలకు ఒక్కటి అమ్ముతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆసిఫ్ బంగారికుంటలో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడి నుంచి 2041గ్రాముల రూ. 50 వేల విలువైన ఎండు గంజాయి, ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్, సెల్ ఫోన్, యమహా (ఎఫ్‌జెడ్ఎస్) బైక్, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణరావు, కానిస్టేబుల్ ప్రభాకర్, సతీశ్, రాజు, అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల తనిఖీ

అంతర్గాం, ఏప్రిల్ 10: డీఆర్‌డీఓ కళిందిని గురువారం అంతర్గాం మండలంలోని గోలివాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పండ్ల తోటల పెంపకం, బీమాపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. తర్వాత పెద్దంపేట గ్రామంలో కుట్టు మిషన్ కేంద్రంను సందర్శించారు. ఆమె వెంట ఎంపీడీవో వేణుమాధవ్, సూపరింటెండెంట్ కరుణాకర్, ఏపీఓ రమేష్, టీఏలు, సీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

జూలపల్లి/ఎలిగేడు, ఏప్రిల్ 10 : అభం శుభం తెలియని ఐదేండ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లిలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో దాదాపు ఓ 23 ఏండ్ల యువకుడు పసి పాపను బుజ్జగించి అత్యాచారం చేయడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. ఆ చిన్నారి అరుపులు, కేకలు వేయగా, చుట్టుపక్కల వారు వచ్చేలోగా నిందితుడు పారిపోయాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో జూలపల్లి పోలీసులను ఆశ్రయించారువివరాలు తెలియాల్సి ఉన్నది. బాధితులు ఫిర్యాదు చేయడానికి ఠాణాకు రాత్రి వచ్చినట్లు ఎస్ఐ సనత్‌కుమార్ వెల్లడించారు.

## నేడు మహనీయుల స్ఫూర్తి దీక్ష చేపట్టనున్న పుట్ట మధూకర్

మంథని, ఏప్రిల్ 10: మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మహనీయుల స్ఫూర్తి దీక్ష కార్యక్రమాన్ని స్వీకరించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు గురువారం తెలిపారు. మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించి దీక్షను స్వీకరించి ఈ నెల 14వ తేదీ వరకు దీక్షలో ఉండనున్నారు.

## పరామర్శ

మంథని రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని విలోచవరం గ్రామానికి చెంది మంథని రఘు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పుట్ట మధూకర్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులున్నారు.

## బాధిత కుటుంబానికి సాయం

కోల్‌సిటీ, ఏప్రిల్ 10: గోదావరిఖని నగరంలోని లెనిన్‌నగర్‌కు చెందిన ఓరుగంటి రాజమ్మ టీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె అకాల మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడ్డారు. స్థానికుల వీహెచ్ఆర్ ఫౌండేషన్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన సభ్యులు గురువారం ఆమె పెద్దకర్మకు వెళ్లి 50 కిలోల బియ్యం అందించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
HOUSE FOR SALE
★ కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం-1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.
NTK-337576

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189